

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం 6.23(సాయంత్రం)

సెహరీ : గురువారం 5.00 (ఉదయం)

పిచ్చుకలు మానవ నేస్తాలు

- బుల్లి పిట్టకు కొండంత కష్టం..!
- కనుమరుగవుతున్న ఊర పిచ్చుకలు
- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



ఆత్మకూరు, మార్చి 19: ఆధునిక ప్రపంచంలో బుల్లిపిట్టలకు పెద్దకష్టాలు వచ్చాయి. గతంలో పల్లెల్లో పూరిగుడిసెలు వుండటం వల్ల వాటిలో పిచ్చుకలు ఆవాసాలను ఏర్పాటు చేసుకునేవి. ఇప్పుడు కాంక్రీట్ మిద్దెల వల్ల పిచ్చుకలకు ఆవాసం కరువైంది. పంటపొలాల దగ్గర నీరు దొరకక ఊర పిచ్చులు ఉసూరుమంటున్నాయి. వీటన్నిటికంటే కూడా సెల్‌టవర్ల వినియోగం పెరగడంతో రేడియేషన్ తీవ్రత పెరిగింది. దీని వల్ల పిచ్చుకల ప్రత్యుత్పత్తికి ఇబ్బంది కలుగుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరికొన్నేళ్లలో పిచ్చుల జాతి అంతరించే ప్రమాదం ఉంది. పాసర్ డొమెస్కిస్ అనే శాస్త్రీయ నామంతో పిలువబడే ఊరపిచ్చుక రైతులకు అన్ని రకాలుగా మేలు చేస్తూ వాతావరణ పరిరక్షణలో, ఆహార గొలుసులో తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. కాగా భారతదేశంలో అంతరించిపోతున్న పక్షిజాతుల్లో పిచ్చుకలు మొదటి స్థానంలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో భారత తపాలా శాఖ 2010లో పిచ్చుకబొమ్మతో కూడిన రూ.5 స్టాంప్‌ను విడుదల చేసింది.

ఊరపిచ్చుకలకు కొండంత కష్టం వచ్చిపడింది. తెల్లవారక ముందే చెట్ల మీద, ఇంటి ముంగిట కీచ్‌కీచ్‌మంటూ కనిపించే ఊరపిచుకలు పెరుగుతున్న పట్టణీకరణ, కాలుష్యం, రేడియేషన్ దుష్ప్రభావాలతో అంతరించిపోతున్నాయి. పల్లెసీమల్లో పిచ్చుకలను తమ కుటుంబసభ్యులుగా భావిస్తారు. పంటలు పండగానే రైతన్నలు తమకు అన్ని విధాలుగా మేలు చేస్తున్న పిచ్చుకలు ఆకలితో ఇబ్బందులు పడకూడదని వరి, సజ్జ, జొన్న, వంటి కంకులను ఇళ్లలో వేలాడదీసేవారు. ఆ గింజలు తిని ఇంటి ముంగిట ఉన్న నీటితొట్లలో, కుండల్లో నీరు తాగి పిచ్చుకలు సేదతీరేవి. నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. దీంతో పిచ్చుకలను సంరక్షించడానికి ఏటా మార్చి 20వ తేదీన ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



పిచ్చుకలను ఇలా సంరక్షిద్దాం..!



- ఇళ్ల వద్ద పిచ్చుకల నివాసం కోసం పెట్టెలను లేక గూళ్లను ఏర్పాటు చేయాలి
- ఒక పాత్రలో నీటిని, మరో పాత్రలో ఆహారాన్ని పక్షులకు అందుబాటులో ఉంచాలి.
- పిచ్చుకలు ఉపశమనం పొందేందుకు వీలుగా మొక్కలను పెంచాలి.
- గార్డెన్‌లో పురుగులు, కీటకాలు అభివృద్ధి అయ్యేలా పెంటను(మేన్యూర్) జల్లాలి.
- పిచ్చుకలు గూళ్లలో గుడ్లను పొదిగేటప్పుడు అంతరాయం కలగకుండా శ్రద్ధ వహించాలి.
- సెల్‌టవర్లు, రేడియేషన్ ఉత్పత్తి చేసే యంత్రాలను పట్టణాలకు, గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయాలి.

పరీక్ష కేంద్రాల తనిఖీ



పాణ్యంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

పాణ్యం, మార్చి 19: మండలంలో జరుగుతున్న పది పరీక్షలను కలెక్టర్ శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పది పరీక్ష కేంద్రంలో తాగునీరు. వైద్య సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్విజిలేటర్లతో పాటు ఎవరూ పరీక్షా కేంద్రాలలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదన్నారు. పాణ్యం క్రీడా మైదానంలో గుంపులుగా జనాలు ఉండడంతో పాటు సెల్‌ఫోన్లు వినియోగిస్తుడడంతో వారిని దూరంగా ఉండేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ కఠినంగా అమలు చేయాలన్నారు. అనంతరం బలపనూరు జడ్పీ హైస్కూలులోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు సౌకర్యాల ఏర్పాటులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఈవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

1,306 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల (నూనెపల్లె): పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 1,306 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 134 పరీక్షా కేంద్రాలలో 25,209 మంది విద్యార్థులకు గాను 23903 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1306 మంది గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. హిందీ పరీక్షకు 95 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. మొత్తం మీద పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అన్నారు. ఎస్పీ రఘువీరారెడ్డి, డీఈవో సుధాకర్‌రెడ్డి రెండు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 38 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. రాష్ట్ర పరిశీలకులు ఆర్ఎస్ గంగాభవాని 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. సమస్యాత్మక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

శేష వాహనంపై జ్వాలా నరసింహస్వామి



ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి



దిగువ అహోబిలంలో విహరిస్తున్న ప్రహ్లాదవరదస్వామి

నంద్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఐదో రోజు మంగళవారం జ్వాలా నరసింహస్వామి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరించారు. అదేవిధంగా దిగువ అహోబిలంలో లక్ష్మీనారసింహుడు గరుడవాహనంపై భక్తులకు దర్శనమివ్వగా రాత్రి హనుమంతవాహనంపై తిరువీధుల్లో విహరించారు. శ్రీవారి ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఇదిలా ఉండగా అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి వారిని మహారాష్ట్ర ఫారెస్ట్ ప్రిన్సిపల్ కార్యదర్శి వేణు గోపాలరెడ్డి, మలేషియా ఐఎఫ్ఎస్ నాగభూషణరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్‌ను కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. వీరి వెంట ఫారెస్టు అధికారులు శ్రీపతినాయుడు, సిబ్బంది ఉన్నారు.

దారి కాజేసిన ఘనుడు

- రెవెన్యూ, పంచాయతీ అధికారుల మౌనం
- పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది
- నిర్మాణాన్ని తొలగించాలంటున్న గ్రామస్థులు



సుగాలిమెట్టలో ప్రధాన రహదారిని అక్రమించి చేపట్టిన ఇంటి నిర్మాణం ఇదే..

పాణ్యం, మార్చి 19 : మండలంలోని సుగాలిమెట్టలో రహదారి స్థలం ఆక్రమణతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రామంలోని సచివాలయం, పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై కాట్రావత్ రవినాయక్ అనే వ్యక్తి ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇదేమని ప్రశ్నించిన పాఠశాల ఉపాధ్యాయులపై దాడికి పాల్పడ్డాడు. రహదారి లేక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి, తహసీల్దారు, ఎంపీడీఓకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారం కిందట ఈ నిర్మాణంపై పోలీసులకు, తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా వారు మౌనం వహించి, ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ అక్రమ నిర్మాణాన్ని గ్రామస్తులందరూ కలసి తొలగించడానికి సిద్ధమయ్యారు. ఈ సమస్యను తహశీల్దారు ఫణికుమార్ దృష్టికి తీసుకువెళ్లగా తాను ఎన్నికల విధుల్లో ఉండడంతో పరిశీలించలేదని వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తానని అన్నారు. ఎంపీడీఓ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమస్యను పరిశీలించి వివరణ ఇవ్వాలని ఈఓఆర్డీని ఆదేశించామన్నారు.


ప్రభుత్వ వాణిజ్య స్థలాల్లో ఎన్నికల హోర్డింగులు అనుమతించవద్దు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

నంద్యాల (కల్చరల్), మార్చి 19: ప్రభుత్వ వాణిజ్య స్థలాల్లో ఎన్నికల ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోనున్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో జిల్లా ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్స్‌కు అనుమతిలేదని, ఇప్పటికే ఉన్నవాటిని వెంటనే చెరిపివేయాలని అన్నారు. ప్రభుత్వ అనుమతితో ప్రైవేటు భవనాలపై ఇప్పటికే ఉన్న పెద్ద హోర్డింగులు, కటౌట్ల భద్రతను, నిర్మాణ స్థిరత్వాన్ని ఒకసారి పరిశీలించాలని, స్ట్రక్చర్‌లో ఏమాత్రం దృఢత్వం లేకపోయినా ప్రకటనలకు అనుమతించవద్దన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణను పెంచాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపే ఎన్నికల సిబ్బందికి మరో ఒకటి రెండుసార్లు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే అంశంపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించాలన్నారు.

6 నుంచి శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు

ఆలయ ఈఓ డి.పెద్దిరాజు



శ్రీశైలం, మార్చి 19: శ్రీశైల మహాక్షేత్రంలో ఏప్రిల్ 6 నుంచి 10 వరకు ఐదురోజులపాటు ఉగాది మహోత్సవాలను దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు కార్యాలయ భవనంలోని సమావేశమందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ అన్ని విభాగాధిపతులు, పర్యవేక్షకులు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ పెద్దిరాజు మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కాలిబాట మార్గంలో వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాల్లో సదుపాయాల కల్పనకు లోటులేకుండా చూడాలన్నారు. ఉత్సవాలలో స్వామి, అమ్మవార్ల కైంకర్యాలన్నీ సంపూర్ణంగా జరిపించేందుకు అవసరమైన ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రపరిధిలోని ఆరుబయలు ప్రదేశాలు, పార్కింగ్ తదితర ప్రదేశాలలో భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గుర్రప్ప, శ్రీశైలం సీఐ రమేష్‌కుమార్, ఎస్‌ఐలు లక్ష్మణరావు, గంగయ్యయాదవ్, అగ్నిమాపక స్టేషన్ ఆఫీసర్ అయూబ్‌ఖాన్, మండల ప్రాథమిక వైద్యురాలు శ్రీవాణి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలులో కష్టాలు

- ప్రభుత్వ పథకాల చుట్టూ వైసీపీ ప్రచార చిత్రాలే
- ఎలా తొలగించాలో అంతుపట్టని అధికారులు
- సచివాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ప్రభావం చూపని కోడ్



నంద్యాల మండలం చాపిరేవుల పీహెచ్‌సీ సెంటర్‌లో సీఎం జగన్ ప్రచార చిత్రం

నంద్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి)/ నంద్యాల (రూరల్): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రభుత్వ ప్రచార చిత్రాలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లు బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండకూడదు. వాటిని వెంటనే తొలగించాలి. ఈ మేరకు ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే జిల్లాలో చాలా ప్రాంతాల్లో అధికార పార్టీ ప్రచార చిత్రాలు కనిపిస్తూనే ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీల ప్రచార చిత్రాలను తొలగించడంలో చూపిన శ్రద్ధ వైసీపీ వారివి తొలగించడంలో అధికారులు చూపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తాము ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను పాటిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

వాటి పరిస్థితి ఏమిటి..?

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచార చిత్రాలు సరే.. కానీ లబ్ధిదారులకు అందించే చాలా వాటి మీద సీఎం జగన్ ఫొటోలు అంటించి ఉన్నాయి. ఉదాహరణకు పిల్లలకు, గర్భిణులకు అందించే పౌష్టికాహార ప్యాకెట్ల మీద, పాఠశాలల్లో ఇచ్చే చిక్కీ ప్యాకెట్ల మీద సీఎం జగన్ ఫొటోలు ఉన్నాయి. ఇవి ఎప్పుడో ప్యాక్ అయ్యాయి. వారం, పది రోజుల ముందుగానే వీటిని సరఫరా చేసి ఉంటారు. కాబట్టి కొత్తవి వచ్చేంత వరకు వీటి సరఫరా ఆపే పరిస్థితి లేదు. ఇక కొత్తగా వచ్చే వాటిలో మార్పు జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి. ఈ ప్యాకెట్లను ఎలా నిలువరించాలో అధికారులకు అంతుచిక్కడం లేదు. ఇక ఆరోగ్య శ్రీ కార్డుల మీద, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే హెల్త్ కార్డుల మీద ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను తొలగించేందుకు కూడా ఇదే ఇబ్బందిని అధికారులు ఎదుర్కొంటున్నారు. మొత్తానికి ప్రభుత్వ తీరుకు, ఎన్నికల కమిషన్‌కు మధ్య అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క మాదిరి తయారైంది.



చాపిరేవుల రహదారిపై తొలగించని సీఎం జగన్ ప్రచార చిత్రాలు

రంగుల పరిస్థితి ఏమిటి..?

ఏ ప్రభుత్వం చూపనంత ప్రచార పిచ్చి వైసీపీ ప్రభుత్వం ప్రదర్శించింది. ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి వైసీపీ రంగులు వేయించింది. దీనిపై గతంలో విమర్శలు వచ్చినా ఏమాత్రం తగ్గలేదు. అయితే షెడ్యూలు విడుదల కావడంతో ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల కమిషన్ మాట వినాల్సిందే! పోస్టర్ల, హోర్డింగులు, మిగిలిన ప్రచార చిత్రాలు తీసివేయం పెద్ద పనేమి కాదు కాబట్టి తొలగిస్తారు. వైసీపీ మూడు రంగులతో నిండిపోయిన ప్రభుత్వ కార్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల వంటిని తెల్లగా చేయాలంటే రెండు మూడు రోజుల్లో అయ్యే పనికాదు. పైగా భారీ ఖర్చుతో కూడుకున్న పని. ఈ భారమంతా ఎవరు మోయాలన్న ప్రశ్న జిల్లా యంత్రాంగాన్ని వేధిస్తోంది. ఒకవేళ ఖర్చుకు వెరసి రంగులను తొలగించకపోతే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలు బలవ్వాల్సి వస్తుందన్న ఆందోళన మరోవైపు వేధిస్తోంది. ఇదంతా సీఎం జగన్ ప్రచార పిచ్చి వల్లేనని, ఎన్నికల కమిషన్ ఎంత వెంటపడ్డా.. ఆయా కార్యాలయాలకు వేసిన రంగులను తొలగించడం ఇప్పట్లో అయ్యే పని కాదని, అప్పటి లోగా ఎన్నికలు కూడా పూర్తవుతాయన్న విమర్శలను ఆయా పార్టీల నాయకుల నుంచి వ్యక్తమవుతోంది.

సమయం ముగిసినా..

ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే ప్రచార చిత్రాలు తొలగించమని ఎన్నికల కమిషన్ అధికారులను ఆదేశించింది. అయితే అది వెంటనే పూర్తయ్యే పని కాదు కాబట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న వాటిని తొలగించడానికి 48 గంటలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న వాటిని తొలగించడానికి 72 గంటల సమయాన్ని ఇచ్చింది. ఈ సమయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచార చిత్రాలను పూర్తిగా తొలగించినట్లు ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రభుత్వానికి లేఖలు అందించాలి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఇప్పటికే ఆ లేఖలను జిల్లా యంత్రాంగానికి అందించారు. ఎన్నికల కమిషన్ ప్రభుత్వ కార్యాలయాలకు ఇచ్చిన సమయం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పూర్తయింది. బహిరంగ ప్రదేశాల్లో ప్రచార చిత్రాల తొలగింపునకు ఇచ్చిన సమయం మంగళవారం మధ్యాహ్నానికి పూర్తయింది. అయినా చాలా చోట్ల ప్రచార చిత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా సచివాలయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ఉన్న బ్యానర్లను తొలగించలేదు. ఇదేమిటని అక్కడ సిబ్బందిని అడిగితే తొలగిస్తామన్న సమాధానం ఇస్తున్నారు. ఇక బహిరంగ ప్రదేశాల్లో, ఆటోల పైన ప్రభుత్వ ప్రచార చిత్రాలు ఎప్పటిలాగే ఉన్నాయి. వీటిని తొలగించేందుకు అధికారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కింది స్థాయి సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదు..?

మండలాల్లో ఉన్న వివిధ కార్యాలయాలకు వెళ్లి ప్రతి చోట పరిస్థితి ఎలా ఉన్నదో అని చూడటం ఆ శాఖల అధికారులకు సాధ్యమయ్యే పరిస్థితి కాదు. కానీ క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు తలుచుకుంటే సులభంగా ఆ పని చేయవచ్చు. అయితే కిందిస్థాయి ఉద్యోగులకు, వైసీపీ నాయకులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉండటం వల్ల ప్రచార చిత్రాలు తొలగించకుండా కొంతమంది తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వంటి వాటిల్లో ఎక్కువగా వైసీపీకి అనుకూలంగా పనిచేసేవారే ఎక్కువగా ఉన్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. వీరంతా ఒక రకంగా వైసీపీ గెలిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే అభిప్రాయం ప్రతిపక్ష పార్టీల నాయకుల నుంచి, స్థానికుల నుంచి కూడా వినిపిస్తోంది. కిందిస్థాయి సిబ్బంది, మండల స్థాయి అధికారులు మీద జిల్లా యంత్రాంగం ఒక్కసారి కొరడా విసిరితే అంతా సర్దుకుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కింది స్థాయి అధికారులు ఇదే ఉదాసీనతను ప్రదర్శిస్తే జిల్లా యంత్రాంగంలోని ఉన్నతాధికారులు ఇరుకున పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వ ప్రచార చిత్రాలను తొలగిస్తారా? లేక స్వామి భక్తి ప్రదర్శించి మిన్నకుండిపోతారా? అన్నది వేచి చూడాలి.

ఓటర్ల చేతిలో పాశుపతాస్త్రం



సీ విజిల్

- ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈసీ కొత్త ప్రయోగం
- గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో యాప్
- ఆడియో, వీడియో, ఫొటోల ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు
- ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లోనే స్పందన
- వంద నిమిషాల్లోనే చర్యలు

ఎలాంటి అక్రమాలు జరగకుండా సార్వత్రిక ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలను చేపడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమయ్యే అన్ని రకాల వనరులను ఈసీ వాడుకుంటోంది. అందులో భాగంగానే తీసుకొచ్చిన 'సీ విజిల్' యాప్ ద్వారా సామాన్య ప్రజలను కూడా భాగస్వామ్యం చేసింది. ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన నాయకుల పని పట్టేందుకు దీనిని పాశుపతాస్త్రంగా ఉపయోగించుకోవచ్చు.

కర్నూలు కలెక్టరేట్/నంద్యాల (నూనెపల్లె) మార్చి 19: రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశ, నిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమలులోకి వచ్చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి. అక్రమాలకు, నిబంధనల ఉల్లఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా గెలవాలని దురుద్దేశంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్ళు లేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కన్ను సన్నల్లో పని చేసేందుకు సిద్ధమవుతోంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వామ్యం చేసింది. సీ విజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించేవారిని పట్టించేందుకు సీ విజిల్ ఎంతగానో దోహదం చేయనున్నది.

సీ విజిల్ అంటే ఏమిటి



ఎన్నికల ప్రవర్తనా నియమావలి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ సీ విజిల్ యాప్ అందులోబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్షాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని ప్రజలు ఎవరైనా వినియోగించుకోవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఐదు నిమిషాల్లోనే రంగంలోకి...



యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేసుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

రిజిస్ట్రేషన్ చేసుకోవడమెలా?

ముందుగా సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారు సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసుకుంటే సీ విజిల్ యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా ప్రజలు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటి ఫిర్యాదులు చేయాలంటే...

ఎన్నికల ప్రవర్తన నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాలలో తరలించడం, ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలి.

ఎలా ఫిర్యాదు చేయాలి..



యాప్ తెరవగానే స్క్రీన్‌పై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం, తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఎన్నికల సంఘానికి చేరుతుంది. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది. యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత విషయంపై విచారణజరుపుతారు. సీ-విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు. ఇక్కడ ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే ఎవరైనా సీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



అడ్డుకట్ట వేసేందుకే 'సీ విజిల్'

తాయిలాలు పంచి అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమగీతం పాడవచ్చు. బాధ్యత గల పౌరుడిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్‌ను కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, రాజ్యాంగ బద్ధంగా ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిగేందుకు పౌరుడిగా మనవంతు బాధ్యతను నిర్వర్తించేందుకు ఈ యాప్ దోహదం చేస్తుంది.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్



ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్

నందికొట్కూరు, మార్చి 19: ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వకపోవడంతో అన్న జగన్మోహన్‌రెడ్డిని వదిలి చెల్లెలు షర్మిల చెంతకు చేరారు నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్. వైసీపీపై అసంతృప్తిగా ఉన్న నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ మంగళవారం విజయవాడలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆయనతోపాటు కౌన్సిలర్ ధర్మారెడ్డి, మరికొందరు కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వైసీపీకి నియోజకవర్గంలో గట్టి షాక్ తగలనుంది. వైసీపీకి కంచుకోటగా ఉన్న మాల సామాజిక వర్గం ఓట్లు కాంగ్రెస్ వైపు వెళ్లే అవకాశకం కనిపిస్తోంది.

గ్రావెల్ తవ్వితే చర్యలు



అక్రమ తవ్వకాల్లో సీజ్ చేసిన టిప్పర్లు

కర్నూలు(అర్బన్), మార్చి 19: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం కర్నూలు రూరల్ మండలం ఎదురూరు గ్రామ పొలిమేరలో సర్వే నంబర్ 156లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యాగంటిలో పుష్ప-2 సినిమా షూటింగ్



యాగంటి వెంకటేశ్వరగవి వద్ద చిత్రీకరిస్తున్న దృశ్యాలు

బనగానపల్లె, మార్చి 19: ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వర గవి వద్ద పుష్ప-2 సినిమా షూటింగ్ మంగళవారం జరిగింది. పుష్ప మూవీకి సీక్వెల్‌గా పుష్ప-2 సినిమా రూపొందుతోంది. ఈ సినిమా వివిధ ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. మైత్రి మూవీస్ మేకర్స్ బ్యానర్‌లో సుకుమార్ దర్శకత్వంలో వెంకటేశ్వర గవి వద్ద పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరో అల్లు అర్జున్ వివాహ సన్నివేశానికి కొనసాగింపుగా ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను హీరోయిన్ రష్మిక, నటి రమ్యకృష్ణ, క్యారక్టర్ నటుడు అజయ్ తదితరులతో చిత్రీకరించారు. బుధవారం కూడా షూటింగ్ కొనసాగనుంది.

ఆస్పత్రిలో ఎలుకల బెడద

- హెచ్‌వోడీల ఫిర్యాదు
- కొత్త వెబ్‌సైట్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: సర్వజన వైద్యశాలలో ఎలుకల బెడద అధికమైందని, వార్డుల్లోకి వస్తున్నాయని కొందరు హెచ్‌వోడీలు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరీ హాలులో ఆరోగ్యశ్రీ ఈ-హాస్పిటళ్లపై హెచ్‌వోడీలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎలుకలు, దోమలు, బొద్దింకల నివారణ కోసం పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీకి నెలకు రూ.5.30 లక్షలు నిధులు వెచ్చిస్తున్నామని, ఎలుకలు ఉంటే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఏజెన్సీకి తెలిపి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంతలో కొందరు వైద్యులు ఎలుకలను నియంత్రించాలని కోరారు. రోగుల సహాయకులు కొన్ని వార్డుల్లో భోజనాలు చేస్తూ మిగిలిన ఆహార పదార్థాలను అక్కడే పడేస్తున్నారని, దీనివల్ల ఎలుకలు సంచారం ఎక్కువైందని అన్నారు. ఆసుపత్రికి ఒక కొత్త వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అన్ని విభాగాల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. ఈ వెబ్‌సైట్ కోసం వివిధ విభాగాధిపతులు సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆర్ఎంవో వెంకటరమణ, హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

బుగ్గనకు రూ.వేల కోట్లు ఎలా వచ్చాయి?

- మంత్రి కాకముందు ఆస్తులెంత?
- సీఎం జగన్, మంత్రి బుగ్గన ఇద్దరూ దొంగలే..
- ప్రజల గొంతులు కోసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు..
- జీవితాంతం జగన్ జైల్లో ఉండాల్సిందే..
- డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 19: ఆర్థిక మంత్రి కాకముందు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆస్తులెంత..? ఇప్పుడు ఆయన ఆస్తులు వేల కోట్లకు ఎలా చేరాయని మాజీ కేంద్ర మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మంగళవారం డోన్ మండలంలోని సీసంగుంతల, యు.కొత్తపల్లి గ్రామాల్లో కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డిలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య కూర్చుని మంత్రి బుగ్గన ఏదేదో మాట్లాడుతున్నారని, మా కుటుంబానికి బుగ్గన అసలు సమవుజ్జీ కానే కాదని అన్నారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారని, తాను కేంద్ర మంత్రిగా పని చేశానని, 70ఏళ్ల క్రితం మా ఆస్తులు ఎంత ఉన్నాయో.. ఇప్పుడు అంతే ఉన్నాయన్నారు. బుగ్గన మంత్రి కాకమునుపు ఎన్ని ఆస్తులు ఉన్నాయి.. ఐదేళ్లలో మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని అక్రమంగా సంపాదించిన ఆస్తుల విలువెంతో ప్రజల ముందు పెట్టే ధైర్యముందా అని సవాల్ విసిరారు. సీఎం జగన్, మంత్రి బుగ్గన ఇద్దరూ దొంగలేనని, ప్రజల గొంతులు కోసి రాష్ట్రాన్ని దోచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచడం, ప్రజలను దోపిడీ చేయడం అభివృద్ధి అవుతుందా అని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన నిధులతో రోడ్లు, ఆసుపత్రి, బడులు కట్టి తానేదో చేసినట్లు మంత్రి బుగ్గన ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో కోట్ల, కేఈ కుటుంబాలు చేసిన అభివృద్ధే కనిపిస్తుందని, బుగ్గన చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలన్నారు. డోన్ నియోజకవర్గంలో కరువు వచ్చి రైతులు నష్టపోతే.. ఆర్థిక మంత్రిగా ఉండి కూడా డోన్, ప్యాపిలి మండలాలను ఎందుకు కరువు మండలాలుగా ప్రకటించలేదని నిలదీశారు. మంత్రి బుగ్గన చెప్పే మోసపు మాటలను డోన్ నియోజకవర్గ ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని, టీడీపీని తప్పనిసరిగా ప్రజలు గెలిపించడం ఖాయమని ఉద్ఘాటించారు.



సీసంగుంతలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, మద్దిరమణ, శ్రీనివాస భట్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, రాంబాబు రెడ్డి, రంజిత్ కిరణ్, దేవరబండ వెంకటనారాయణ, చంద్రపల్లి ఆచారి, అన్వర్‌బాషా, ఎస్ఎండీ రఫీ, మిద్దెపల్లి గోవిందు, సీసంగుంతల శివ నాగిరెడ్డి, గోవిందు, మాజీ ఎంపీటీసీ గౌరమ్మ, బీజేపి నాయకులు వడ్డె మహరాజ్, ఆర్మీ రామయ్య, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బ్రహ్మం పాల్గొన్నారు

రెండో రోజు పది పరీక్షలు ప్రశాంతం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 19: జిల్లాలో మంగళవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. పరీక్షలకు 31,637 మంది నమోదు చేసుకోగా.. 30,807 మంది పరీక్షకు హాజరు కాగా, 560 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకుల అధికారి గీత, డీఈఓ, ఇతర అధికారులు సెంటర్లను తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా ఒక మాల్ ప్రాక్టీసు కేసు నమోదైనట్లు తెలిపారు.

రేడియో థెరపీ టెక్నీషియన్ పోస్టుల కౌన్సిలింగ్ వాయిదా

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు సంబంధించిన రేడియో థెరపీ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఈ నెల 20న నిర్వహించాల్సిన కౌన్సిలింగ్ వాయిదా వేసినట్లు కర్నూలు మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరిచరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్టు, సెలక్షన్ లిస్టు సరి చేశాక కౌన్సిలింగ్ తేదీని వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

సీఎం బొమ్మ అవుట్..!

- ఎట్టకేలకు ఓపీ చీటీలో తొలగించిన అధికారులు
- మంత్రులు, ఎమ్మెల్యే ఫొటోలు సైతం..



సీఎం జగన్ బొమ్మ కనపడకుండా పేపర్‌ను అతికించిన సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అధికారులు అప్రమత్తమయ్యారు. సీఎం జగన్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు కనపడకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నెల 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కోడ్ ఉల్లంఘన' కథనానికి అధికారులు స్పందించారు. ఓపీ చీటిల్లో ఉన్న ముఖ్యమంత్రి బొమ్మను తొలగించారు. అలాగే ఫ్లెక్సీల్లో కూడా సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు ఎక్కడా కనిపించకుండా పేపర్లను అతికించారు.



మందులు ఇచ్చే కేంద్రంలో ఫ్లెక్సీపై పేపర్‌ను అతికించిన సిబ్బంది



ఓపీ వివరాలు అందించే హోర్డింగ్‌పై సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలను పేపర్లతో కప్పేశారు



ఓపీ కౌంటరు నెంబరు-10 గదికి పేపర్లను అతికిస్తున్న సిబ్బంది

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

● కలెక్టర్ శ్రీనివాసులు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్, జేసీ

నంద్యాల (కల్చరల్), మార్చి 19: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం సూచించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించి సహకరించాలని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు రాజకీయ పార్టీల ప్రతినిధులను సూచించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల నిర్వహణ, రాజకీయ పార్టీ అభ్యర్థులు చేయాల్సిన ఖర్చులపై జేసీ రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో పద్మజ, రాజకీయ పార్టీల తరపున వారి ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లా డుతూ అభ్యర్థుల ఖర్చు వివరాలను లెక్కించేందుకు ఐదు రకాల బృందా లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్, 10 స్టాటిస్టిక్ సర్వైలెన్స్ వీడియో సర్వైలెన్స్ బృందాలు పర్యవేక్షిస్తా యని చెప్పారు. దీంతో పాటు పెయిడ్ న్యూస్ రేట్లను, సమావేశాల నిర్వహణకు, హాజరయ్యే ప్రజలు ఖర్చు పెట్టే ఆల్పాహార, భోజనం రేట్లు మొదలైన వాటి కి నిర్ధారించిన రేట్లకు లెక్క కట్టి సంబంధిత పార్టీ లేదా అభ్యర్థి ఖాతాలో పొందుపరుస్తామని కలెక్టర్ తెలిపారు. పార్లమెంటరీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ. 40 లక్షలు మించకూడదని కలెక్టర్ తెలిపారు.

ప్రతి చిన్న ఘటననూ వీడియో తీయాలి: జేసీ

నంద్యాల (కల్చరల్), మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ స్టాటిస్టిక్ సర్వైలెన్స్ వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియోగ్రాఫర్లు ఎన్నికలకు సంబంధించిన ప్రతి చిన్న ఘటననూ వీడియో తీయాలని జేసీ టి. రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో అన్ని టీమ్‌ల వీడియో గ్రాఫర్ల ఇచ్చిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా ఉన్న ప్రతి అంశాన్ని చిత్రీకరించాలన్నారు. అలాగే అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, సమావేశానికి హాజరైన ప్రజలు, సమావేశానికి అయ్యే ఖర్చు, ఓటర్లకు పంపిణీ చేసే వస్తువులు, వినియోగించిన వాహనాలు తదితరాలన్నిటినీ వీడియో తీయాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ప్రతి ఒక్కరికి షాడో టీం ఏర్పాటు చేస్తామని... ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి సాక్షాదారులతో వీడియోగ్రఫీ ఉంటే రిపోర్ట్ ఆధారంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈసీఐకి పంపుతామన్నారు. వీడియో గ్రాఫర్లుషిప్టుల ప్రకారం సంబంధిత టీమ్‌ల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్‌డీసీ కామేశ్వరరావు వీడియోగ్రఫీ తీయాల్సిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి'



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సాయుధ బలగాలు

గడివేముల, మార్చి 19: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పాణ్యం సీఐ నల్లప్ప ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన దుర్వేసి, చిందుకూరు మంచాలకట్ట, పెసరవాయి గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లోని ఇరు పార్టీ నాయకులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

'ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి'

ఆత్మకూరు, మార్చి 19: కేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని శ్రీశైలం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుధారాణి సూచించారు. మంగళవారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో శ్రీశైల నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు, శ్రీశైలం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, ఎన్నికల విభాగం అధికారులచే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ప్రత్యేకించి ప్రతి మండలానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం 24గంటల పాటు పర్యవేక్షణ చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు, మద్యం వంటి ప్రలోభాలను గురిచేయకుండా ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం నిఘా వుంచనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గాజులపల్లి, సున్నిపెంట, ఆత్మకూరు సరిహద్దు ప్రాంతాల్లో పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. కాగా నియోజకవర్గంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ప్రజలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఎన్నికల విధుల్లో ఏ చిన్నపొరపాట్లకు తావులేకుండా పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాస రావు, సీఐ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

మహానంది, మార్చి 19: పర్యావరణ, అటవీ, వణ్యప్రాణుల సంరక్షణపై అటవీ సిబ్బంది మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహానంది మండలం చలమ బీట్‌తో పాటు నల్లమల అడవిలోని కొన్ని ప్రాంతాలను మహానంది రామకృష్ణ గురుకుల విద్యాలయం ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు చూపించారు. అటవీశాఖ ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు సిబ్బంది ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి కొన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని నంద్యాల రేంజ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజా ప్రతాప్, సిబ్బంది, కరస్పాండెంట్ పీసీవీ కృష్ణమోహన్, బి.వెంకటేశ్వర్లు, రావిళ్ళ సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

● తలముడిపిలో సామూహిక మరుగుదొడ్డి పనులు ప్రారంభం

● నిర్మించవద్దని స్థానికుల ఆందోళన



సామూహిక మరుగుదొడ్డి నిర్మించవద్దంటూ నిరసన తెలుపుతున్నస్థానికులు

నందికొట్కూరు, మార్చి 19: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న సమయంలో సామూహిక మరుగుదొడ్డి నిర్మాణం కోసం అధికారులు సోమవారం పనులు ప్రారంభించిన ఘటన మిడ్తూరు మండలం తలముడిపి గ్రామంలో చోటు చేసుకుంది. 2014లో ఓడీఎఫ్ గ్రామాల్లో భాగంగా 8 సామూహిక మరుగుదొడ్లను అధికారులే కూలదోశారు. ఇప్పుడు బీసీ కాలనీలో సామూహిక మరుగుదొడ్డిని నిర్మిస్తే అధికార పార్టీకి ఓటు వేస్తామని స్థానికులు చెప్పడంతో అధికార పార్టీ నాయకులు గ్రామపంచాయతీ తీర్మాణం లేకుండా సామూహిక మరుగుదొడ్డి నిర్మాణం కోసం సోమవారం పనులు ప్రారంభించారు. సామూహిక ఏర్పాటు చేస్తున్న స్థలం పక్కనే అంగన్‌వాడీ కేంద్రం కోసం దాతలు ఇచ్చిన 3 సెంట్ల స్థలం ఉందని, కుటుంబాలు నివసిస్తున్నాయని ఇలాంటి చోట ఎలా మరుగుదొడ్డిని నిర్మిస్తారని మల్లేశ్వరమ్మ ప్రశ్నించారు. గతంలో ఉన్న సామూహిక మరుగుదొడ్డి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తాయని, కాలనీలో ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఉన్నాయన్నారు. ఎవరికైనా లేకపోతే వారికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. తమ ఇంటి సమీపంలో మరుగుదొడ్డిని నిర్మించడం వల్ల దుర్వాసన, మురుగునీరు ప్రవహిస్తూ రోగాల బారిన పడుతున్నామన్నారు. గతంలో అధికారులు పగలగొట్టినా తిరిగి నిర్మించడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. కేవలం ఎన్నికల సమయంలో తమ పబ్బం గడుపుకునేందుకు అధికార పార్టీ నాయకులు కావాలనే ఇట్లా చేస్తున్నారని ఆమె వాపోయారు. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేనప్పుడు గ్రామ పంచాయతీ సెక్రటరీ పనులు ప్రారంభించి వెళ్లారని జ్యోతి అనే మహిళ ఆరోపించారు. టీడీపీ నాయకుడు అంకిరెడ్డి మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ అనుమతులు లేకుండా మండలంలో సామూహిక మరుగుదొడ్డి నిర్మాణాన్ని ఎలా చేపడతారని అధికారులను ప్రశ్నించారు. కేవలం అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పంచాయతీ సెక్రటరీ గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా పనులు ప్రారంభించారని అన్నారు. పంచాయతీ సెక్రటరీ శాలు బాషా ప్రవర్తించిన తీరును నందికొట్కూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. పంచాయతీ సెక్రటరీ శాలుబాషా స్పందిస్తూ ఈనెల 13న గ్రామ పంచాయతీ తీర్మానించిందని, ఆ మేరకే పనులు ప్రారంభించామని చెప్పారు.

'పొట్టి శ్రీరాములు విగ్రహానికి ముసుగు తొలగించాలి'



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందికొట్కూరు, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణం లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు కోరారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు నాగసత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన కేజీ రోడ్డులోని పొట్టి శ్రీరాములు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి ముసుగు వేశారని, అయితే ఎన్నికల నిబంధనలు పొట్టి శ్రీరాములు విగ్రహానికి వర్తించవని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు అసువులు బాసిన వ్యక్తి చారిత్రక నేపథ్యం ఉన్న మహోన్నత వ్యక్తి అని ఆయన అన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాణ్యం, మార్చి 19: పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం, ఫిజికల్ ఎడ్యుకేషన్ గంటల ప్రకారం వేతనంతో బోధించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ సింహాద్రి తెలిపారు, మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన అధ్యాపకులు సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం ఆపైన మార్కులు కలిగి ఉండాలన్నారు. ఏపీ సెట్, నెట్ లేదా పీహెచ్‌డీ కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 20 వతేదీ లోపల కళాశాలలో సమర్పించి ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వెళ్లాలి?

● వైసీపీ నాయకుడు, సర్పంచ్ శివరామిరెడ్డి ఆవేదన

గోస్పాడు, మార్చి 19: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఏ ముఖం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగాలని నెహ్రూనగరం వైసీపీ నాయకుడు, సర్పంచ్ శివరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గోస్పాడులో ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు వేయకుండా నిలిపి వేశారని, దీంతో గ్రామాల్లో నాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి డెవలప్‌మెంట్ ఫండ్ కింద మండలంలో రూ. 70 లక్షల పనులు చేశామని, అయితే ఇంత వరకు ఒక్క రూపాయి కూడా రాలేదని, దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గడప గడపకు వచ్చినప్పుడు మంజూరు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. నిజాయితీగా పనులు చేసే వైసీపీ కార్యకర్తలకు డబ్బులు రావడం లేదని, పైరవీ కారులకు మాత్రం ముందుగా బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. మండలంలో చేసిన పనులకు కూడా సీఎఫ్‌ఎంఎస్ ద్వారా బిల్లులకు పంపిస్తే ఇంత వరకు రాలేదని వాపోయారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో మళ్లీ పార్టీ కోసం ఏ విధంగా పని చేయాలని ప్రశ్నించారు.

రేపు కొలనుభారతి హుండీ ఆదాయం లెక్కింపు

కొత్తపల్లి, మార్చి 19: మండలంలోని కొలనుభారతి సరస్వతి అమ్మవారి హుండీ లెక్కింపును గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే శాశ్వత హుండీ లెక్కింపునకు ఆలయ ఛైర్మన్ వెంకట నాయుడుతో పాటు ధర్మకర్త మండలి సభ్యులు కూడా హాజరవుతారని తెలి పారు. హుండీ లెక్కింపులో భక్తులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు.

శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

పాణ్యం, మార్చి 19: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశా లలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి మాట్లాడుతూ హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ జనరల్ మేనేజరు దారారమేష్, కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ అధికారి డాక్టర్ ఏవి బద్రీనా థ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు కృషి చేయాలి: డీఎంహెచ్‌వో



చాపిరేవులలో రిజిస్టరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నంద్యాల రూరల్, మార్చి 19: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని, టీబీ నివారణకు అందరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డా.ఆర్.వెంకటరమణ ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి మంగళవారం చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ కోసం నిర్వహిస్తున్న లేబర్ రూమ్‌ను, ల్యాబ్‌లో అందుబాటులో ఉన్న పరీక్షల తీరును పరిశీలించారు. కుష్ఠు వ్యాధిని గుర్తించటానికి ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారి డాక్టర్ సహలం తదితరులు ఉన్నారు.

'క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదు'

ఆత్మకూరు రూరల్: క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని ఈ వ్యాధిపై ఎలాంటి భయాందోళన అవసరం లేదని టీబీ సూపర్‌వైజర్ కల్లూరి పెద్దమస్తానయ్య, హెచ్‌ఎం దబోరాలు విద్యార్థులకు సూచించారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల సందర్భంగా మండలంలోని కొట్టాల చెరువు ప్రభుత్వ ఎస్టీ గిరిజన ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధి నివారణపై విద్యార్థులకు అవ గాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ సామక్క, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



ఆత్మకూరులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు, మార్చి 19: ఆత్మకూరు పట్టణంలో జరుగుతున్న పది పబ్లిక్ పరీక్షలను ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ శివార్లలోని నంద్యాల రస్తాల గల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించి పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను కఠినంగా అమలుచేయాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ఆత్మ కూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ ఉన్నారు. కాగా మంగళవారం జరిగిన పరీక్షకు ఆత్మకూరు మండలంలో మొత్తం 1320 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1235 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యా శాఖాధికారి-1 జానకీరామ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పది పబ్లిక్ పరీక్షలకు మంగళవారం 39 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్ ఎగ్జామినర్లు రఘుస్వామి, ఇబ్రహీం తెలిపారు మంగళవారం రెండవ రోజు హిందీ పరీక్షకు కొత్తపల్లి సెంటరులో 165 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 143 మంది హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారు. అలాగే గోకవరం సెంటరులో 93 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 76 మంది హాజరు కాగా, 17 మంది గైర్హాజరయ్యారు. ఈ రెండు సెంటర్లను కొత్తపల్లి తహసీల్దార్ తిరుపతయ్య పరిశీలించారు.

మహానంది: మహానంది మండలంలోని గాజులపల్లి జడ్పీ హైస్కూలులోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పరిశీలించారు. మంగళవారం పది పరీక్ష కేంద్రంలోని గదులనుతనిఖీలు చేశారు. మండలంలోని నాలుగు పది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలులో ఉందని ఎస్‌ఐ చెప్పారు. వంద మీటర్ల దూరంలో ప్రజలు గుమికూడదన్నారు. సమీపంలో ఎటువంటి జిరాక్స్ సెంటర్లు తెరవడానికి అనుమతి ఇవ్వలేదన్నారు. ఎవరైన హద్దు మీరి ప్రవర్తిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ సిబ్బంది, భక్తులు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మార్చి 19: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గాని, శుక్రవారం గాని భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు ఇచ్చారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యం

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిరుపతికి చెందిన నటరాజ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, వినాయకకౌత్వం, శంకరా శశిధర, శంభో శివ శంభో, అదిగదిగో శ్రీశైలం తదితర గీతాలకు సుదీక్ష, మోక్షిత, రామవర్షిణి, గీతిక, దీప్తి, దివ్య, జస్వంత్, లాస్య, హేమశ్రీ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు చరిత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గౌరు చరిత

గడివేముల, మార్చి 19: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ అమలు చేయబోయే సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి లేదని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని అన్నారు. కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాలేదన్నారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆరోపించారు. నిత్యావసర ధరలు ఆకాశన్నంటాయన్నారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపారని అన్నారు. ఒక్కసారి అవకాశమంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, శ్రీనివాసయాదవ్, గిరిబాబు, ఈశ్వర్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిల్పా ఏం అభివృద్ధి చేశారు?: బుడ్డా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, మార్చి 19: ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఏం అభివృద్ధి చేశారని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రశ్నించారు. ఆత్మకూరులోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ పొత్తుపై మైనార్టీల్లో చిచ్చుపెట్టేలా చేసే దుష్ప్రచా రాలను నమ్మవద్దని ముస్లింలకు సూచించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, కలీముల్లా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు సుదర్శన్, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

● ఆత్మకూరు, బండిఆత్మకూరు, శ్రీశైలం మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు మంగళవారం ఆత్మకూరులో బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. శ్రీశైలానికి చెందిన పొట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 130 ఆర్యవైశ్య కుటుంబాలు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు రామ్మోహన్, కురువ శివరామకృష్ణ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు చేరాయి. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, నారాయణపురం గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ నాగమణి, పలువురు నాయకులు పార్టీలోకి చేరారు. చిన్నదేవళాపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, శ్రీపతిరావుపేట గ్రామానికి 60 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలోకి చేరారు.

● ఆత్మకూరులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రీశైలం కన్వీనర్ మోమిన్ షబానాను మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా దివంగత సర్పంచ్ మోమిన్ జిలానీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బీజేపీ నాయకురాలు మోమిన్ షబాన మాజీ ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మౌలీబాషా, సుదర్శన్, సాంబశివగౌడ్, గోపాల్, విశ్వరూపాచారి, కాశీగౌడ్ తదితరులు ఉన్నారు.

బైరెడ్డి శబరికి ఘన స్వాగతం



శబరికి స్వాగతం పలుకుతున్ననాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు

పగిడ్యాల, మార్చి 19: బైరెడ్డి శబరికి టీడీపీలో చేరాక మొదటి సారిగా ఆమె సొంత గ్రామమైన ముచ్చుమర్రికి రావడంతో ముచ్చుమర్రి, నెహ్రూనగర్ గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం బైరెడ్డి శబరి కొణిదేల గ్రామం వద్ద ముచ్చుమర్రి, నెహ్రూనగర్ క్రాస్ నుంచి నెహ్రూనగర్ టీడీపీ నాయకులు బైక్ ర్యాలీ ముచ్చుమర్రి వరకు నిర్వహించారు. అక్కడ ముచ్చుమర్రి గ్రామస్థులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి గ్రామస్థులతో ఆమె నడుస్తూ.. వారి ఉభయకుశల ప్రశ్నలు వేస్తూ ర్యాలీ చేశారు. కొత్తముచ్చుమర్రి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పాత ముచ్చుమర్రి గ్రామంలోని శివాలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె స్వగృహానికి చేరుకొని గ్రామస్థులతో ఆమె మాట్లాడారు. మహిళలు గజమాలతో బైరెడ్డి శబరిని సన్మానించారు. కార్యక్రమంలో కాటం వెంకటరామిరెడ్డి, టీడీపీ నియోజకవర్గ అధికారప్రతినిధి కాకరవాడ చిన్నవెంకటస్వామి, నాగేశ్వరరావు, కట్టుబడి శ్రీనివాసులు, గుణశేఖర్‌రెడ్డి, నాగలూటి గోకారి, డా.కరీమ్, చిన్న సుంకన్న, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా వెంకట రమేశ్

పాములపాడు, మార్చి 19: టీడీపీ నాయి బ్రాహ్మణ సాధికార సమితి నంద్యాల జిల్లా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా పాములపాడు మండలంలోని మిట్టకందాల గ్రామానికి చెందిన వెంకటరమేశ్ ఎన్నికయ్యారు. టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూర్ టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు హరిప్రసాద్, హఫీజ్‌ఖాన్, ప్రవీన్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, తదితర ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్రార్చన



పూజలు చేస్తున్న అర్చకులు

నంద్యాల (కల్చరల్), మార్చి 19: నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ దేవి వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం ప్రభాతపూజ నిర్వహించారు. వివిధ రకాల పండ్ల దండలతో అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు. భక్తులు అమ్మవారికి నవావరణ పూజా విధితో శ్రీచక్రార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు గండాదీపాలు వెలిగించి అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. అలాగే అన్ని రకాల కూరగాయలను దండలుగా కట్టి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం ప్రదోషపూజ, మహా మంగళ హారతి నిర్వహించారు. భక్తులకు దుర్గా ఫెండ్స్ యూనిట్ సభ్యులు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికల అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న బార్ అధ్యక్షుడు సూర్యనారాయణ

నంద్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల అధికారులు బాలగురువరెడ్డి, నాగేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎంపికకు నామినేషన్లు స్వీకరించామని, కార్యవర్గంలోని పదవులకు నామినేషన్ గడువు ముగిసే సమయానికి ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించామన్నారు. అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నరసింహారెడ్డి, కార్యదర్శిగా అంబటి గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా దాదాపీర్, కోశాధికారిగా నేరేళ్ల మురళీమోహన్, మహిళా ప్రతినిధిగా కె. రమాదేవి ఉన్నారని వారు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, మార్చి 19: మండలంలోని గొడిగనూరు గ్రామంలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో అనూరాధ మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కోడి గుడ్లు పంపిణీ చేయాలని అన్నారు. మెనూ ప్రకారం తయారు చేయాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. అనంతరం విద్యార్థుల గ్రేడింగ్‌ను, రికార్డులను పరిశీలించారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఓబుళపతి, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన గ్రామీణ విద్యార్థులు

చాగలమర్రి, మార్చి 19: చాగలమర్రికి చెందిన గైబువలి, సర్దార్‌బాషా అనే యువకులు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన సీనియర్ హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బీహార్‌లో 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే 52వ హ్యాండ్‌బాల్ సీనియర్ పురుషుల జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్టు తరపున పాల్గొంటారని నంద్యాల అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన యువకులను పీడీ దాదాపీర్, క్రీడాకారులు అభినందించారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 19: చాగలమర్రి గ్రామంలోని సెయింట్ ఆన్స్ తదితర పాఠశాలల్లో జరుగుతున్న పదోతరగతి పరీక్షల కేంద్రాలను మంగళవారం నంద్యాల జిల్లా డిప్యూటీ డీఈవో మహబూబ్‌బేగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల పరీక్షా గదులను, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్, డీవోలకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

చాగలమర్రి, మార్చి 19: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు, జెండాలు, విగ్రహాలకు ముసుగులు వేయించామని అన్నారు. రాజకీయ పార్టీలు సభలు నిర్వహించే ముందు అనుమతి తప్పనిసరి అన్నారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులోను పకడ్బందీగా నిర్వహించాలని కార్యదర్శులు, బీఎల్‌వోలకు ఆదేశించామని అన్నారు. ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ఎన్నికల కమీషన్ ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు, నాయకులు సహకరించాలని అన్నారు.

రుద్రవరం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాణి అన్నారు. మంగళవారం రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లో సందర్శించి అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

చాగలమర్రి, మార్చి 19: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో వైసీపీ నాయకులు మంగళవారం కోడ్ ఉల్లంఘించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రజకుల కోసం చెరువులో బోరు పనులు చేపట్టారు. ఇటీవల కొందరు రజకులు వైసీపీలో చేరారు. వారి కోసం అధికార పార్టీ అండతో చెరువులో బోరు వేసేందుకు పనులు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ వర్గీయులు బోరు వేయిస్తున్నారని టీడీపీ నాయకుడు గోపాల్ ఆరోపించారు. ఈ విషయం గురించి తహసీల్దార్ రమణమ్మకు ఫిర్యాదు చేయగా ఆమె స్పందించి కార్యదర్శి, వీఆర్వో చే బోరు పనులను నిలిపి వేయించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి

నంద్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఎన్నికల నిబంధనలను పాటించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రచారం చేసుకోవాలని, పార్టీల అభ్యర్థుల వ్యక్తి గత అంశాలపై విమర్శలు మానుకోవాలని సూచించారు.

టేకు దుంగలు, సైకిళ్లు స్వాధీనం

రుద్రవరం, మార్చి 19 : నల్లమల అటవిలో నరికి అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందడంతో దాడి చేసినట్లు రుద్రవరం సెక్షన్ ఆఫీసరు నాగరాజు మంగళవారం తెలిపారు. ఈ దాడిలో టేకు దుంగలు, మూడు సైకిళ్లు పట్టుబడ్డాయన్నారు. టేకు దుంగలు, సైకిళ్లను రుద్రవరం ఫారెస్టు కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

మంచినీటి సమస్య ఉంటే చెప్పండి

రుద్రవరం, మార్చి 19 : మండలంలో మంచినీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ మంగళవారం తెలిపారు. మండలంలోని యల్లావత్తుల గ్రామంలో చేతిపంపుల్లో భూగర్భజలం అడుగంటడంతో సింగిల్‌ఫేజ్ మోటర్లు ఏర్పాటు చేశామన్నారు. శ్రీరంగాపురం గ్రామంలో ఓ ప్రైవేటు వ్యక్తి మోటరు బాడుగకు తీసుకుని ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా సరఫరా చేస్తున్నామని, నరసాపురం పంచాయతీ పరిధిలోని తుమ్మలపల్లె గ్రామానికి ఈ నెల 1 నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్, కార్యదర్శి పాములేటి ఉన్నారు.



యల్లావత్తులో చేతిపంపుకు సింగిల్ ఫేజ్ మోటరు ఏర్పాటు చేసి పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ, సర్పంచ్

వైసీపీకి షాక్...

టీడీపీలోకి పెరుగుతున్న చేరికలు



జొలదరాసి నాయకులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 19: రోజురోజుకూ టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. గ్రామగ్రామాన వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత వల్లే తాము పార్టీని వీడుతున్నట్లు నాయకులు పేర్కొంటున్నారు. కోవెలకుంట్ల మండలం జొలదొరాసి గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మొగదల పెద్దకుమార్, అప్పపోగుల మారన్న, బిళ్లగాళ్ల శివ, మొబ్బు యేసేబు, గుల్లకుంట ఓబులేసు, కల్వటాల శ్రీను, వడ్డె రామతిమ్మయ్య, నాగరాజు, కమలపురి ఓబులేసు, వెంకటసుబ్బన్న, పిట్లశివ, టంగుటూరు బాలరాజు, మధు, వెంకటేశ్ తదితర కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బీసీ మాట్లాడుతూ టీడీపీలో చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన నాయకులు ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలై అధోగతి పాలైందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చేసే వ్యక్తి నారాచంద్రబాబునాయుడు ఒక్కరే అని నమ్మి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బీసీ జనార్దన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి టీడీపీ గెలుపుకోసం పనిచేస్తామని తెలిపారు.

భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

కోవెలకుంట్ల, మార్చి 19: ఇటీవల చిలకలూరుపేటలో నిర్వహించిన ప్రజగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని సీతారామనగర్ కాలనీలో బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ ఈనెల 17న చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో పాల్గొన్న దేశ ప్రధాని నరేంద్రమోదీకి భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ ఉన్నతాధికారులపై ఎన్నికల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దేనికి సంకేతమని బీసీ ప్రశ్నించారు. బీజేపీ, టీడీపీ, జనసేన తొలి ఎన్‌డీఏ సభ విజయవంతమైందన్నారు. మూడు పార్టీల కార్యకర్తలు భారీగా పాల్గొని సభను విజయవంతం చేశారన్నారు. అయితే ట్రాఫిక్ జాం వల్ల వేలాది మంది ప్రజలు సభకు రాలేకపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వంతోపాటు అందులో పనిచేస్తున్న కొందరు పోలీస్ అధికారులు వైసీపీ తొత్తులుగా వ్యవహరించి ఉద్దేశ పూర్వకంగా సభకు అడ్డంకులు సృష్టించారని బీసీ విమర్శించారు. 2024లో సైకో పాలనకు అంతం పలికి ప్రజాప్రభుత్వం టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్తంగా ఏపీలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గడ్డం నాగేశ్వరరెడ్డి, బీవీ. ప్రసాద్‌రెడ్డి, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, అమడాల మద్దిలేటి, కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వల్లపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, గడ్డం అమర్‌నాథ్‌రెడ్డి, బిజనవేముల హుసేనయ్య, వెలగటూరు ధనుంజయుడు, పెనుగొండ రాజశేకర్, కుళాయి, గుంజలపాడు కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

నీచ రాజకీయాలకు రోజులు దగ్గరపడ్డాయి

భూమా అఖిలప్రియ



సంతాపం తెలుపుతున్న భూమా అఖిలప్రియ

చాగలమర్రి, మార్చి 19: రాష్ట్రంలో నీచ రాజకీయాలకు రోజులు దగ్గరపడ్డాయని ఆళ్లగడ్డ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. చాగలమర్రిలో టీడీపీ సానుభూతిపరుడు ఇమామ్‌హుసేన్ హత్య విషయం తెలుసుకున్న భూమా అఖిలప్రియతో పాటు టీడీపీ యువనాయకుడు జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్ మృతదేహం వద్ద సంతాపం ప్రకటించి కుటుంబీకులకు సానుభూతి వ్యక్తం చేశారు. వారిలో మనోధైర్యం నింపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హత్య జరిగిన తీరు గురించి టీడీపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ తమను నమ్ముకున్న వారిపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం, చివరకు హత్య చేసే వరకు వచ్చారంటే వైసీపీ వర్గీయుల రౌడీయిజం, గుండాయిజం ఎలా ఉన్నాయో అర్థమవుతోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నంద్యాల బీసీ సెల్ స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, అనిఫ్, ఖలీల్, అజీమ్, గఫార్, జెట్టి నాగరాజు, రామసుబ్బయ్య, గురుశేఖర్‌రెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఇంటిపైన కట్టుకున్న టీడీపీ జెండా తొలగింపు

● ఎన్నికల అధికారికి ఫిర్యాదు



మాట్లాడుతున్న తిరుపాలు నాయుడు

ప్యాపిలి, మార్చి 19: తన ఇంటిపైన అభిమానంతో కట్టుకున్న టీడీపీ జెండాను అధికారులు బలవంతంగా తొలగించారని జలదుర్గం గ్రామంలో టీడీపీ నాయకుడు తిరుపాలునాయుడు అన్నారు. దీంతో అధికారుల తీరుపై ఈసీకి ఫిర్యాదు చేశానని తిరుపాలునాయుడు తెలిపారు. ఎన్నికల కోడు రావడంతో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగయ్య తిరుపాలు నాయుడు ఇంటి దగ్గరకు వెళ్లి జెండా తీసేయాలని చెప్పారు. దీంతో తిరుపాలు నాయుడు ఇది ప్రభుత్వ స్థలం కాదు, పబ్లిక్ ప్రాంతం కాదు తన ఇంటిపైన కట్టుకున్న జెండాను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తమకు ఉన్నతాధికారులను నుంచి ఆదేశాలు వచ్చాయంటూ బలవంతంగా జెండాను తొలగించారని తిరుపాలు నాయుడు ఆరోపిస్తున్నారు. జెండా తొలగింపుతో మనస్తాపం చెంది రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జెండా తొలగింపుపై ఎంపీడీవో సాయి మనోహర్‌ను వివరణ కోరగా కార్యదర్శి ఎన్నికల కోడ్ ఉన్నందన జెండాను తొలగించాలని చెప్పడంతో తిరుపాలు నాయుడు దానిని తీశారని, తమ బలవంతం లేదన్నారు. ఘటనపై కార్యదర్శితో మాట్లాడానన్నారు. సొంత ఇళ్లు అయినందున జెండా ఏర్పాటు చేసుకున్న అభ్యంతరం లేదన్నారు.

ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బేతంచెర్ల, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి సమస్యాత్మక గ్రామమైన అంబాపురం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాల వద్ద ఆయా పార్టీల నాయకులతో, గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామంలో గొడవలు పడకుండా శాంతియుతంగా ఉండాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో హెచ్‌కానిస్టేబుళ్లు షేక్షావలి, కానిస్టేబుళ్లు తిరుమలయ్య, అబ్దుల్ కరీం, గ్రామ పెద్దలు, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

ఇండియా కూటమిని గెలిపించుకుందాం

బేతంచెర్ల, మార్చి 19: ప్రధాని నరేంద్ర మోదీ యంత్రాంగానికి అడ్డుకట్ట వేసేందుకు దేశంలో ఇండియా కూటమిని గెలిపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు పరిచే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. కేంద్రంలో, రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. కార్మికులను పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫకృద్దీన్, పట్టన కార్యదర్శి కె.ప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, జిల్లా సమితి సభ్యులు ఎస్.భార్గవ్ పాల్గొన్నారు.

'టీడీపీని గెలిపించండి'

నంద్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అఖిలప్రియ కోరారు. ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని యేసునాధపురం, శ్రీనివాసనగర్, సామెల్ వీధుల్లో మంగళవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు.

●రుద్రవరం గ్రామానికి చెందిన బెస్తలు వైసీపీ నుంచి టీడీపీలోకి మాజీ మంత్రి అఖిలప్రియ సమక్షంలో మంగళవారం రాత్రి ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో చేరారు.

అహోబిలానికి ఎండ్ల బండ్లపై..

రుద్రవరం, మార్చి 19 : అహోబిళం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఎద్దులబండ్లపై వెళ్లడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు తెలిపారు. నంద్యాల పట్టణం నుంచి ప్రతి ఏడాది రెండు ఎద్దులబండ్లపై బ్రహ్మోత్సవాలకు వెళ్తున్నామన్నారు. మంగళవారం రుద్రవరం సమీపంలో ఎద్దుల బండ్లతో వస్తున్న భక్తులు అహోబిళం బ్రహ్మోత్సవాలకు వెళ్తున్నట్లు తెలిపారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేస్తున్న కెవికె కోఆర్డినేటర్ ధనలక్ష్మి తదితరులు

బనగానపల్లె, మార్చి 19: ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలని కెవికె కోఆర్డినేటర్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణ శివారులోని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో రైతులకు ఎరువుల యాజమాన్యంపై రైతులకు కెవికె, నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సంయుక్తంగా ఎరువుల యాజమాన్యంపై ధనలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. సేంద్రియ ఎరువులు వాడి పంటలు పండిస్తున్న రైతులకు ప్రశంసాపత్రాలు అందించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ అధికంగా రసాయనిక ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గి పురుగు, తెగుళ్ల ఉధృతి పెరిగి వ్యవసాయ ఖర్చులు పెరుగుతాయన్నారు. నేషనల్ ఫర్టిలైజర్స్ ఏరియా మేనేజరు వంశీకృష్ణ, నంద్యాల సేల్స్ అధికారి వినోదునాయక్‌లు మాట్లాడుతూ నానో యూరియా ఉపయోగాలను రైతులకు వివరించారు. కెవికె శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు మాట్లాడుతూ పశువుల ఎరువులను వాడాలని, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, పంట వ్యర్థాలను పొలంలో కలియదున్నాలని అన్నారు. మట్టినమూనా సేకరించే విధానం, ఎరువల యాజమాన్యం పద్ధతులను వివరించారు. సూక్ష్మజీవులు నేలలో పెరగాలంటే రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. నేలను కప్పి ఉంచే పైర్లను సంవత్సరం పొడవునా వేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానాలు పాటించి నాణ్యమైన దిగుబడులతో రైతుల నికర ఆదాయం పొందాలన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

ఉయ్యాలవాడ, మార్చి 19: ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలి ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. మంగళవారం కాకరవాడ గ్రామంలో గ్రామస్తులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడేవారి సమాచారం ఇవ్వాలన్నారు.

● పుచ్చకాయలపల్లె క్రాస్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ట్రాఫిక్ నిబందనలు పాటించని 20 మందిపై కేసు నమోదు చేసి వారికి రూ. 5400 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల వేల వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తామని ఆయన తెలిపారు.

గిద్దలూరులో ధార్మిక కార్యక్రమాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న సభ్యులు

సంజామల,, మార్చి 19: మండలంలోని గిద్దలూరులో టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ధార్మిక కార్యక్రమాలు శివాలయం వద్ద నిర్వహించనున్నారు. ఆధ్యాత్మిక వేత్త సాత్వానంద స్వామి ఆధ్వర్యంలో ధార్మిక ప్రవచనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి ధార్మిక ప్రవచనాలు స్థానిక ప్రజామండలి చే భజనలు శుక్రవారం గోపూజ, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కరపత్రాలను సర్పంచ్ హుసేనమ్మతో కలిసి విడుదల చేసిపంపిణీ చేశారు. అర్చకులు, నాగేశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

సంజామల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సంజామల ఎస్ఐ రమేశ్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఆకుమల్ల, పేరుసోముల గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

నిరుద్యోగ యువతను వంచించిన వైసీపీ



డోన్‌లో కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కోత్రాయి సర్పంచ్‌తో పాటు వైసీపీ కార్యకర్తలు

డోన్, మార్చి 19: గత ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చిన వైసీపీ మాట తప్పి నిరుద్యోగ యువతను వంచించిందని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి యేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి యువతను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. మెగా డీఎస్సీతో టీచర్ల పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో నిరుద్యోగ యువతకు ఇచ్చే భృతిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



కొత్తపల్లిలో కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీ నాయకుడు నబీరసూల్, అనుచరులు

డోన్(రూరల్), మార్చి 19: డోన్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ముస్లీం మైనార్టీ నాయకుడు నబీరసూల్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మంగళవారం రాత్రి కొత్తపల్లి గ్రామంలో జరిగిన టీడీపీ ప్రచారాల్లో భాగంగా పాల్గొన్న మాజీ కేంద్ర మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరి కోట్లకు మద్దతు తెలిపారు. నబీరసూల్‌తో పాటు ఆయన అనుచరులు కూడా కోట్ల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

కోట్ల పర్యటనను విజయవంతం చేయాలి

ప్యాపిలి, మార్చి 19: మండలంలో బుధువారం మాజీ కేంద్రమంత్రి, టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పర్యటించానున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని మాధవరం, గార్లదిన్నె, రాచెర్ల, రామక్రిష్టాపురం గ్రామాల్లో కోట్ల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారన్నారు. టీడీపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నాటు సారా విక్రేతల అరెస్టు

బనగానపల్లె, మార్చి 19: మండలంలోని బనగానపల్లె, పలుకూరు, అవుకు, , కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో నాటుసారా అమ్మకం దారులు, తయారు దారులపై దాడులు నిర్వహించినట్లు సెబ్ సీఐ జోగేంద్ర మంగళవారం తెలిపారు. సింగనపల్లెకు చెందిన ఈడిగ సుంకయ్య, ఈడిగ మునిప్రసాద్‌గౌడ్ వద్ద 60 లీటర్ల నాటుసారా, కొలిమిగుండ్లలో లక్ష్మమ్మ వద్ద 20 లీటర్ల నాటుసారా, తుమ్మలపెంటలో నాగేంద్ర వద్ద 50 లీటర్లు, సారాసీజ్ చేసి ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈదాడుల్లో సీఐ విజయకుమార్, ఎస్ఐ పోతులయ్య, మోహన్, కృష్ణ, అజాద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు. -

సూపర్ 6 పథకాలతోనే అభివృద్ధి

కొలిమిగుండ్ల మార్చి 19: చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ 6 పథకాలతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కొలిమిగుండ్ల 42వ పోలింగ్ బూత్ ఇన్‌చార్జ్ టైలర్ వెంకట్రాముడు అన్నారు. మంగళవారం బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ 6 క్యాలెండర్‌లను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని సూచించారు.

బేతంచెర్ల: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన, దౌర్జన్యాలు కొనసాగిస్తుందని రానున్న ఎన్నికల్లో ఓటుతో వైసిపికి బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపి... టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని మండల టీడీపీ నాయకులు సీపీరాముడు అన్నారు. మంగళవారం సిమెంటునగర్‌లో మండల టీడీపీ అధ్యక్షులు ఉన్నం ఎల్లనాగయ్య ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి సూపర్‌సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సీపీ రాముడు, బూత్ ఇన్‌చార్జిలు వాసు, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి తీరని లోటు



అయ్యన్న మృతదేహం వద్ద సంతాపం తెలుపుతున్న నాయకులు

చాగలమర్రి, మార్చి 19: మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు ఎస్.అయ్యన్న (60)మృతి తీరని లోటని టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. అయ్యన్న అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మృతుడి నివాసం వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఉసేన్‌రెడ్డి, రామ్మోహన్, ఓబుళపతి, రమణ, రాజు, నరహరి, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి పెద్దవంగలి దస్తగిరిస్వామి ఉరుసు

చాగలమర్రి, మార్చి 19: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో వెలసిన దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉరుసు సందర్భంగా దర్గాను ముస్తాబు చేశారు. 23న గంధం, 24న ఉరుసు మహోత్సవం జరుగుతుందని అన్నారు. 20 నుంచి 25వ తేదీ వరకు దర్గా వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని అన్నారు. ఉరుసు మహోత్సవానికి కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం జిల్లాల నుంచే కాక హైదరాబాదు నుంచి కూడా భక్తులు తరలివచ్చి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఉరుసు సందర్భంగా రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు, గాడిద పందెములు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఓటరు నమోదుకు 543 దరఖాస్తులు

ఉయ్యాలవాడ, మార్చి 19: తుది జాబితా అనంతరం మండలంలో నిర్వహించిన ఓటరు నమోదుకు 543 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు వెంకటరమణ మంగళవారం తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చేంత వరకు ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 18 ఏళ్ల పైబడిన వారు అవకాశాన్ని ఉపయోగించుకోవాలి ఆయన సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి శిక్ష

కోవెలకుంట్ల, మార్చి 19: కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ డ్రైవ్‌లో ముగ్గురికి కోవెకుంట్ల కోర్టులో శిక్ష పడినట్లు ఎస్ఐ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ముగ్గురికి ఒక నెల జైలు శిక్ష జరిమానా విధించినట్లు తెలిపారు. ఒక వ్యక్తికి ఒక నెల జైలు శిక్ష రూ.2 వేలు జరిమానా, మరో వ్యక్తికి ఒక నెల జైలు, పదివేలు జరిమానా, మరో వ్యక్తికి రూ.2వేలు జరిమానా, ఒక నెల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.